

# కట్నమివ్వనక్కండి

వసుంధర

ఎవరో తలుపు తట్టారు.

ఇంట్లో మగాళ్ళంతా భోజనాలు చేస్తున్నారు.

"నువ్వెళ్ళి తలుపు తీయవే!" అంది అమ్మ.

వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా ఉన్న ఆయనకు సుమారు యాభై ఏళ్ళుండవచ్చు. ముఖం చూడగానే వయసు స్ఫురించిందిగానీ, ఎక్కడా చూసినట్లు అనిపించలేదు.

"నాన్నగారున్నారా అమ్మా?" అన్నాడాయన.

"భోంచేస్తున్నారండి! లోపలకు రండి!" అంటూ ఆహ్వానించాను.

కొత్తగా ఎవరైనా ఇంటికి వస్తే ముందు నాకే కుతూహలం. అందుకని—"నాన్నగారికి చెబుతాను. మీ పేరు చెబుతారా?" అనడిగాను.

"పుగాకు కంపెనీ బాపన్నగారని చెప్పు. మీ నాన్నగారికి తెలుస్తుంది" అన్నాడాయన.

ఆ పేరు వినగానే ఆయనెవరో నాకు తెలిసిపోయింది. లక్ష్మి తండ్రి ఆయన. లక్ష్మి నా క్లాస్‌మేట్. ప్రాణస్నేహితురాళ్ళంకాకపోయినా మంచి స్నేహమే మాది. లక్ష్మితో పరిచయమై ఆర్నెల్లయింది. వాళ్ళ నాన్నగారు ట్రాన్స్‌ఫర్ మీద పది నెలల్రకితం ఈ ఊరు వచ్చారుట. బియ్యే మొదటి సంవత్సరంలో నా గ్రూపులోనే చేరింది. ఆమెది కూడా నాకులాగే పెళ్ళి చదువు.

నేను లోపలకు వెళ్ళి నాన్నగారికి చెప్పాను. నాన్నగారు ఆశ్చర్యపడుతూ— "ఆయనకు నాతో పని ఏమిటి చెప్మా?" అని కాస్త పైకే అనుకున్నారు. నాన్నగారాశ్చర్య పడగానే నా కుతూహలం పెరిగింది.

నాన్నగారూ, ఆయనా ఎప్పుడో ఒకసారి క్లబ్బులో కలుసుకున్నారుట. ఎవరో పరస్పర పరిచయాలు చేశారుట. ఇద్దరూ ఒకరికొకరు నమస్కారాలు పెట్టుకున్నారుట. ఆ తర్వాత మళ్ళీ కలుసుకోలేదుట.

నాన్నగారు త్వరగా భోంచేసి ఆయన్ని కలుసుకోడానికి వెళ్ళారు. ఏ గది తలుపు పక్కనో నిలబడి వాళ్ళ సంభాషణ వినడమే నా కర్తవ్యం.

ఇద్దరూ పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకున్నాక, "మా ఇల్లు మీకెలా తెలిసిందండీ?" అనడిగారు నాన్నగారు. అంతకంటే సున్నితంగా అడగడం ఆయనకు చేతకాదు.

బాపన్న గారాట్టే నొచ్చుకున్నట్లు లేదు— "ఆడపిల్ల తండ్రిని. ఎన్ని అడ్రసులైనా తెలుస్తాయి నాకు. ఇందులో ఆశ్చర్యమేముంది?" అన్నాడాయన.

నాన్న ఉలిక్కిపడి—"కానీ నాకు పెళ్ళికావలసిన అబ్బాయిలు లేరే!" అన్నాడు.

"చల్లకువచ్చి ముంత దాచడమెందుకు? ఇటీవల మీరు మీ అమ్మాయి కళ్యాణికో పెళ్ళి సం

బంధం చూశారుట కదా?" అన్నాడు బాపన్నగారు.

"అవును. ఈ సంగతి మీకెలా తెలిసింది?" అన్నారు నాన్నగారు ఆశ్చర్యంగా.

లక్ష్మి నా క్లాస్‌మేట్. పెళ్ళి చూపులైన మర్నాడు నేను లక్ష్మికి అన్నీ వివరంగా చెప్పాను.

కుర్రాడి పేరు శేఖర్. బియ్యే ప్యాసయ్యాడు. ప్రైవేట్ కంపెనీలో నెలకు ఏడువందలు జీతం. ఉద్యోగం వచ్చాకనే పెళ్ళి సంబంధాలు చూడడం మొదలు పెట్టాడు. నాదే మొదటి కేసు.

శేఖర్ మనిషి బాగానే ఉన్నాడు. మాటల్లో కూడా సంస్కారం కనబడింది. కానీ....

మా నాన్నగారు ఆదర్శవాది. అన్నయ్య పెళ్ళికి కట్నం తీసుకోలేదు. నా పెళ్ళికి కట్న మివ్వదల్చుకోలేదు. అలాగని మాకు డబ్బు లేకపోలేదు. తల్చుకుంటే ఆయన నాకు ఇరవై వేల దాకా కట్నమివ్వగలరు. కానీ ఇవ్వరు. ఈయన ఆశయం కారణంగా నాకు పెళ్ళి కాదేమోనని అమ్మకు భయం. కానీ నాకు భయంలేదు. కట్నం ఆడదానికి అవమానం. మగవాడికి ఆడదానితోడు అవసరం. పెళ్ళంటే ఒక ఆడది- తన వాళ్ళందర్నీ వదులుకుని జీవితాంతం ఒక మగవాడికి తోడుగా ఉండడం కోసం వెళ్ళిపోవడం. అందుకు ఇస్తే గిస్తే మగవాడే కట్నమివ్వాలి. ఆడదివ్వడ మేమిటి?

నేను జీవితాంతం కన్యగానైనా మిగిలిపోతానుగానీ కట్నమివ్వడానికి ఒప్పుకోను. నాన్నగారి ఆదర్శాన్ని నేను మనస్ఫూర్తిగా ఆమోదిస్తున్నాను.

శేఖర్‌కి కట్నం కావాలి. ఎనిమిది వేలు. అందుకు ఏవో కుంటిసాకులు చెప్పాడు. ఏ పరిస్థితుల్లో తను కట్నం తీసుకోబోతున్నాడో అతడి తండ్రి వివరించాడు.

కట్నం మాటల దగ్గరే ఆ సంబంధం చెడిపోయింది.

నేనీ వివరాలన్నీ లక్ష్మికి చెప్పాను. లక్ష్మి తండ్రికి చెప్పింది. బాపన్నగారిక్కడకు వచ్చాడు.

"అయితే మా అమ్మాయి నుంచి వచ్చిందన్న మాట మీకు సమాచారం!" అంటూ నవ్వారు నాన్నగారు.

"అవునండీ!" అని ఓసారి ఇబ్బందిగా దగ్గి—"మీరా సంబంధం వదులుకున్నారని తెలిసింది. అందుకు కారణాలు తెలుసుకుందా

మని వచ్చాను" అన్నాడు బాపన్న గారు.

"అంటే?"

"కుర్రాడి వివరాలన్నీ బాగానే వున్నాయి. అడిగిన కట్నం కూడా ఎక్కువలేదు. ఆ సంబంధం మీరు వదులుకున్నారంటే ఆశ్చర్య మేసింది!"

"కారణాలకు ఏముందండీ! కుర్రాడి క్కట్నం కావాలి. నేను కట్నమిచ్చే వైపు కాదు. నాపిల్లను చూసి పెళ్ళి చేసుకోవాలిగానీ, దాని వెనుక ఉన్న డబ్బును చూసేవాడికి నేను పిల్లనివ్వదల్చుకో లేదు" అన్నారు నాన్నగారు.

"ఇంతేనా? ఇంతకు మించి కారణాలేమీలేవా!" అన్నాడు బాపన్నగారు.

"అంటే?"

"కుర్రాడిలో ఏమైనా లోపాలు, కుర్రాడి వంశంలో ఏమైనా...."

"అలాంటివుంటే నేను వ్యవహారాన్ని పెళ్ళి చూపులదాకా రానిచ్చే వాడిని కాదు" అన్నారు నాన్నగారు.

మాయింట్లో నేనే పెద్ద ఆడపిల్లను. నాన్నగారు కట్నమివ్వనని చెబుతూంటే పెళ్ళిళ్ళపేరయ్య కూడా అంత సీరియస్‌గా తీసుకోలేదు. అన్నీ సరిపోతే ఆ మాత్రం కట్నమివ్వరా అనుకున్నాట్ట. లేకపోతే శేఖర్ నన్నుచూడడం జరిగి ఉండేదికాదు.

బాపన్నగారి ముఖం వికసించింది. "అయితే మీరీ సంబంధం వదలుకున్నట్లేగా?"

"ఏం? మీరు చూసుకుందామనా?" అడిగారు నాన్నగారు. అంతకంటే సున్నితంగా అడగడమాయనకు చేతకాదు.

"అవునండీ! మంచి సంబంధాలు దొరకడమే కష్టంగా ఉన్నాయి. ఈ మాత్రం సంబంధం ఏడెనిమిది వేలలో ఉందంటే ఆశ పుట్టింది. మీరు వదులుకున్నారంటే కుర్రాడిలో ఏమైనా లోపాలున్నాయేమోననుకుని భయపడ్డాను. చాలా థాంక్సండీ! మీకు శ్రమ ఇచ్చినందుకు మన్నించండి!" అంటూ లేచాడు బాపన్నగారు.

నాన్నగారాయన వంక ఆశ్చర్యంగా చూశారు. బాపన్నగారు వెళ్ళిపోయాడు.

ఈ సంబంధం లక్ష్మికి చూస్తున్నారంటే నాకు ఓ రవ్వ అసూయ లాంటిది కలిగింది. ఎంత విలువ లేని వస్తువుకి కూడా ఎవరో ఒకరు దానిపట్ల ఆసక్తి చూపిస్తే విలువ వస్తుంది. శేఖర్‌ని నేను కోల్పోతున్నానేమోనని భయం కూడా

వేసింది. అయితే నా భయాన్నబద్ధం చేస్తూ చంద్రం నా జీవితంలో ప్రవేశించాడు.

చంద్రం బ్యాంకులో గుమాస్తా. మనిషి నాకు నచ్చేటంత బాగుంటాడు. ఓ రోజు బస్ స్టాప్‌లో చూసి నన్ను పలకరించాడు. నేను బదులిచ్చాను. ఆ తర్వాత ఒకరోజు కాలేజీగేటు దగ్గర పలకరించాడు. అతనివరస నాకు నచ్చక, "మీకు నాతో మాట్లాడాలని ఉంటే మా యింటికి రాకూడదూ?" అన్నాను.

"అడ్రసు చెబితే అలాగే వస్తాను" అన్నాడతను తాపీగా.

నేను అడ్రసు చెప్పాను. అతను వచ్చాడు.

అయితే నే నతడితో మాట్లాడలేదు. నాన్నగారతనితో మాట్లాడారు.

"కట్నమా? అదంటేనే నాకు అసహ్యం!" అన్నాడతను.

చంద్రానికి తల్లీ తండ్రీ లేరు. బరువు బాధ్యతలు లేవు. చీకూ చింతా లేని జీవితం!

చంద్రం ఇంటికి పేరుకు పెద్దగా అతడి బాబాయి వున్నాడు. నాన్నగారాయన కుత్తరం రాశారు. పేరుకు పెళ్ళి చూపులు జరిగాయి. సింపుల్‌గా మా వివాహం జరిగిపోయింది.

అన్నట్లు అదే ముహూర్తానికి బాపన్నగారి కూతురు లక్ష్మి పెళ్ళి కూడా అయింది- శేఖర్‌తో.

చంద్రం మంచివాడు. అతడు నన్నెంతో అపురూపంగా చూసుకుంటున్నాడు.

అతడికి నేను తప్ప లోకం లేదు. కానీ....

అతడికి తాహతుకు మించిన కోరికలున్నాయి. పగటి కలలు కనే లక్షణాలున్నాయి.

చంద్రం లేమిలో పుట్టి, లేమిలో పెరిగాడు. ఉద్యోగం రాగానే అతడి జీవితం మారిపోయింది. ఒకప్పుడు అతనంటే నిర్లిప్తత వహించే బంధువుల్లో ఇప్పుడతనిపట్ల గౌరవ భావం పెరిగింది. అందుకే అతను వారందరికీ దూరంగా వుంటూనన్ను కట్నం లేకుండా వివాహం చేసుకున్నాడు.

ఇప్పుడతని కోరిక బంధువుల్లో తన హోదా గుర్తించబడాలని.

కానీ అతడింకా బ్యాంక్ గుమాస్తాయే! అంతకుమించిన గుర్తింపు అతనికి కావాలి!

పెళ్ళికాగానే మామగారింట్లోకి మకాం మార్చాలని అతడికుంది. ఆ ఆహ్వానం మామగారినుంచి రావాలని అతడు ఆశించాడు. ఆ ఆశ నెరవేరకపోవడంతో భార్య

ద్వారా సూచించాడు.

ఆ ఊళ్ళో నాన్నగారికి మొత్తం మూడిళ్ళున్నాయి. ఒకింట్లో మా వాళ్ళుంటున్నారు. మిగతా రెండూ అద్దెల కిచ్చారు. చంద్రం అనేది నాకూ కొంత సబబుగానే తోచింది. 'మేము అద్దె ఇంట్లో వుంటున్నాం. ఎలాగూ అద్దె ఇస్తున్నాం. అదే అద్దె మా నాన్నగారింటికి స్తే?'....

ఇల్లూ బాగుంటుంది. ఇంట్లో స్వతంత్రంగానూ వుంటుంది!

నేను నాన్నగారికి నా అభిప్రాయం చెప్పాను. "ఈ అభిప్రాయం నీదా-అతనిదా?" అనడిగారు నాన్నగారు ఆయనలా అడిగినందుకు కోపం వచ్చింది తప్పితే అందులోని లోతు నాకర్థంకాలేదు. వివాహమైన మా ఇద్దర్నీ ఆయన వేరుచేసి మాట్లాడటం నాకు బాధ కూడా అనిపించింది ఆ క్షణంలో.

నాదేనని చెప్పాను.

ఒకిల్లు ఆఫీసుకిచ్చారు. రెండో ఇంట్లో ఐదేళ్ళుగా ఒకాయన కుటుంబంతో వుంటున్నాడు. ఆయన్ను ఖాళీ చెయ్యమనడానికి నాన్నగారికి మనసొప్పడం లేదు.

ఇది విని అమ్మ మండిపడింది. కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్న ఉత్తముడైన అల్లుణ్ణి నాన్నగారు అకారణంగానే తక్కువ కట్టేశారని నిష్ఠూరమాడింది.

ఫలితం చెప్పనక్కర్లేదు. ఓ రెండు మాసాల అనంతరం మేము ఆ ఇంట్లోకి మారాం.

ఇంట్లో నెల్లాళ్ళు గడిచేక, "ఈ ఇంటికి అద్దె ఎంత ఇవ్వాలోయ్?" అనడిగారాయన.

అంతవరకూ ఈ ఇల్లు మాకిచ్చి నాన్నగారెంతగా నష్టపోయారో నా బుర్రకు తట్టలేదు. మాకు వచ్చే జీతంలో మే మివ్వగలిగిన అద్దె రెండువందలు మాత్రమే. నాన్నగారికీ ఇంటికి ఆరువందలు వచ్చేది.

"పూర్వంలాగే రెండువందలు ఇద్దాం" అన్నాను. మాట్లాడకుండా ఆయన నాకు రెండువందలిచ్చారు. అవి తీసుకుని మా ఇంటికి వెళ్ళాను నేను.

"ఇంటికి రేటు ఎవరు కట్టారు? అతనా- నువ్వా?" అనడిగారు నాన్నగారు.

"ఆయన కట్టమన్నారు- నేను కట్టాను" అన్నాను.

"అతని తీరే వేరు. లోకంలో ఇలాంటి వారు ఎక్కడో గానీ వుండరు" అంది అమ్మ.

నేను తిరిగి ఇంటికివెళ్ళి ఈ విషయం చెబితే ఆయన ఆశ్చర్యపడలేదు. సంతోషించారు. అందుకు నేను ఆశ్చర్యపడ్డాను. అంతా

ఆయన ముందే ఊహించినట్లుంది.

డిశంబర్‌లో కాబోలు ఆయన తన చేతివాచీ అమ్మేశారు. "అదేం టండీ?" అంటే "ఇది ఫాషనై పోయింది. డిజిటాల్ వాచీ కొనుక్కోవాలి" అన్నారు.

జనవరిలో పెద్ద పండగ వచ్చింది. మా పెళ్ళయ్యాక అదే మొదటి సంక్రాంతి. నాన్నగారాయనకు మోటార్ సైకిల్ కొని ఇచ్చారు బహుమతిగా. నేనందుకు ఎంతో మొహమాటపడితే, "నా తాహతుకొద్దీ అల్లుడికి బహుమతిగా ఇచ్చుకుంటున్నాను. ఇది నేను మనస్ఫూర్తిగా ఇస్తున్నది" అన్నారు.

అప్పటికాయన చేతికి వాచీ లేదు. అందుకని మోటార్‌సైకిల్‌తో పాటు ఆయనకు డిజిటాల్ వాచీ కూడా కొన్నారు.

మేమా ఊళ్లో రెండు సంవత్సరాలున్నాం. తర్వాత ట్రాన్స్‌ఫరైంది. ఈ రెండేళ్ళలోనూ నాన్నగారు మమ్మల్ని ప్రతి పండుగకూ ఆహ్వానించి బట్టలుకాక వేరే ఏదో బహుమతి ఇస్తూండేవారు. దాని వెల కనీసం ఓ వంద రూపాయలుండేది.

ట్రాన్స్‌ఫరై ఊరు మారేక ఓ సారి హఠాత్తుగా నాన్నగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

ఆయనకు వ్యాపారంలో అనుకోని పెద్ద నష్టం వచ్చింది.

నేనూ, ఆయనా చూడటానికి వెళ్ళాం. వాళ్ళు మాకు బట్టలు పెట్టారు.

"ఏమిటిది నాన్నా- ఇబ్బందుల్లో కూడా!" అని బాధపడ్డాను నేను.

"చూడమ్మా! అంతా కట్నం దేబరించే రోజుల్లో అతను కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు. అందు కతను చిన్నబుచ్చుకో కూడదు. ఖర్చులంటావా? మీ కోసం పెట్టే ఈ రెండు మూడొందల ఖర్చుతోటీ నా దరిద్రం తీరేది కాదు" అన్నారాయన.

తర్వాత మాయింటి పరిస్థితి మారింది. ఆర్థిక వైభవం అణగారింది.

అప్పుడు నేను- నాభర్త అసలు స్వరూపాన్ని చూశాను.

ఏ పండుగకు నాన్నగారాయన్ని పేక్షించినా, "పాతబడిపోయాను కదా- ఇంక నన్నెందుకు పట్టించుకుంటారు?" అనేవారు. మా వాళ్ళ ఆర్థిక పరిస్థితిగురించి ఆయనకు కించిత్తుకూడా సానుభూతి ఉండేది కాదు. మామగారి ఎదుటపడి అవీ యివీ కావాలని అడగరు కానీ, ఇస్తారన్న ఆశా, ఇవ్వాలన్న కోరికా ఉంది.

నాన్నగారీయ న్నుపేక్షించడం లేదు. చేతనై నంతలో ఈయనకు డబ్బు పంపిస్తూనే ఉండేవారు. ఇలా ఏళ్ళు గడిచాయి.

ఒకరోజాయన నా దగ్గరకు వచ్చి, "కళ్యాణీ! నువ్వు తల్చు కుంటే చిన్న హెల్ప్ చేయగలవు" అన్నారు.

"చెప్పండి?" అన్నాను.

"మనకు కారు అలవెన్సుంది. అలాంటప్పుడు ఈ వెధవ మోటారుసైకిలెందుకు? ఓ సెకండ్ హాండ్ కారు అమ్మకానికొచ్చింది. మోటార్‌సైకిల్ అమ్మగా, బ్యాంక్ వాళ్ళిచ్చే లోన్ పోనూ, మనకింకా అయిదువేలు తక్కువయింది. మీ యింటి కుత్తరం రాస్తావా? ఎంత-రెండేళ్ళలో వాళ్ళ అప్పు తీర్చే ద్దాం!" అన్నారాయన.

అప్పటికి ఇంతవరకూ అన్ని అప్పులు తీర్చినట్లు....ఇప్పుడు తీర్చబోతున్నట్లు....

"ఒక్కసారి అయిదు వేలు వాళ్ళు మాత్రం ఎక్కణ్ణించి తెస్తారండీ? నా బంగారం తాకట్టు పెడితే...."

ఆయన నా మాట పూర్తి కానివ్వలేదు—"భార్య బంగారం తాకట్టు పెట్టి కారుకొంటే, అదీ అఫ్టరాల్ అయిదువేల కోసం.... మనకు అవమానం కళ్యాణీ!" అన్నాడు.

నేను ఇంటికి ఉత్తరం రాశాను. నా బంగారం తాకట్టు పెట్టడం ఈయనకు అవమానం. కానీ, నా కోసం నా తల్లి బంగారం తాకట్టు పెట్టడం నాకు అవమానం కాదు.

నాన్నగారి దగ్గర్నుంచి నా పేరున డ్రాఫ్ట్ వచ్చింది. ఈ విషయం ఆయనకు ఫోన్ చేసి చెప్పాను. వెంటనే ఆయన ఉత్సాహంగా ఇంటికి వచ్చేశారు.

సాయంత్రం ఇద్దరం కలిసి డబ్బు తీసుకుని, కారు అమ్మే ఆయన ఇంటికి వెళ్ళాం. ఆయన శేఖర్ కావడమూ, ఒకప్పటి నా స్నేహితురాలు లక్ష్మిని ఆ విధంగా కలుసుకోవడమూ నాకొక మరపు రాని అనుభూతి.

"మీరీ వూళ్ళోనే ఉంటు న్నారా?" అంది లక్ష్మి ఆశ్చర్యంగా.

"లేదు. ట్రాన్స్‌ఫరయి నాలుగు నెలలైంది" అన్నాను.

లక్ష్మి భర్త శేఖర్‌ని నేను తిరస్కరించాను. అతడు కొంత కాలం వాడి అమ్మబోతున్న కారును నా భర్త కొనాలని నన్నిక్కడకు తీసుకొచ్చాడు. ఏదో అపశ్రుతిలా ధ్వనించింది నాకు.

మేమిద్దరం తెలిపిన వాళ్ళమని

ఆయన మమ్మల్ని వదిలి శేఖర్‌ని పట్టుకున్నారు. వాళ్ళ కబుర్లు వాళ్ళవి, మా కబుర్లు మావి.

కాసేపు అవీ యివీ కబుర్లయ్యేక "ఏమిటీ- కారమ్మేస్తున్నారు.... కష్టాలొచ్చాయా?" అన్నాను.

"కంపెనీ వాళ్ళు అలవెన్సిస్తున్నారు గదా అని కారు కొన్నారు. ఇప్పుడు కంపెనీ ఈయన వాడకం కోసం కారు కూడా ఇస్తున్నది. కంపెనీ కారుండగా స్వంత కారెందుకనీ...." అని అర్థోక్తిలో ఆపింది లక్ష్మి.

"బాగుంది. అంత మాత్రాన స్వంత కారమ్ముకుంటారా? కంపెనీ కారు స్వంత కారు కాదుగదా?"

"అవుననుకో! కానీ చెల్లెలి పెళ్ళికి డబ్బు కూడా అవసరమైంది. చేతిలో ఇది తప్ప లేదు" అంది లక్ష్మి.

"శేఖర్ కెంతమంది చెల్లెళ్ళేమిటీ?" అనడిగాడు. నేను నన్ను లక్ష్మితో పోల్చుకుంటూ చంద్రాన్ని శేఖర్‌తో పోలుస్తున్నాను. చంద్రానికి లేని బాధ్యతలు శేఖర్ కున్నాయంటే అదో తృప్తి.

"పెళ్ళి శేఖర్ చెల్లెలిది కాదు- నా చెల్లెలిది" అంది లక్ష్మి.

"నీ చెల్లెలి పెళ్ళికి శేఖర్ కారమ్మేస్తున్నాడా?" ఆశ్చర్యపోయాను.

"ఇందులో ఆశ్చర్యమేముంది? ఇంటికి పెద్దల్లుడీయన. మా నాన్నకా మగపిల్లలు లేరు. అల్లుడైనా, కొడుకయినా ఈయనే కదా! పెళ్ళివారు పదిహేను వేలు కట్నమడిగారని నాన్న తూగలేనన్నాడు. అప్పుడీయన ధైర్యం చెప్పారు" అంది లక్ష్మి.

సంభాషణ మార్చాలని, "అయితే, మగళ్ళకి కట్నమిచ్చే పాడుబుద్ధి మీ యింట్లోంచి ఇంకా పోలేదన్నమాట?" అన్నాను.

లక్ష్మి నవ్వి, "ఏం కట్నమో లేదూ!కట్నంతీసుకున్న పేరాయనకు వచ్చింది. ఆయనకు ఆడపిల్లలన్నా వారి పరిస్థితులన్నా అంతులేని జాలి ఉంది. ఆయన కట్నమెందుకు తీసుకున్నారో నీకు తెలుసు. పాపం! ఆ తర్వాత నుంచి ఆయన మా యింటి నుంచి ఓ గుడ్డ ముక్క- కూడా ఆశించలేదు. మా నాన్న మొదటి పండక్కి- బట్టలు పెట్టాడని మరో రూపంలో ఆ ఖర్చు ముట్ట చెప్పారు. తర్వాత నుంచి ఈయన నాన్నకు చేసిందే తప్ప- నాన్న ఈయనకు చేసిందేమీ లేదు."

నాకు కళ్ళు తిరిగాయి. ఆలోచిస్తే నాన్న ఆదర్శంలో లోప

మున్నదనిపించింది. ఆయన కట్నా లను నిరసించారు. కానీ ఆశలను రోజు రోజుకీ నీరు పోసి పెంచి- ఇప్పటికి ఓ మ్రానులా తయారు చేశారు. ఆయన కట్నం తీసుకోక పోయినా, మర్యాదల పేరిట ఆయనకు ముట్టిన డబ్బు సామాన్యమా? తల్చుకుంటే నా వళ్ళు జలదరించి పోతోంది.

పెద్దవాళ్ళం మేమిలా కబుర్లు చెప్పుకుంటూంటే, పిల్లలు లోపల వాళ్ళ ఆటలు ఆడుకుంటున్నారు. మధ్యన ఏమయిందో ఏమో- నా కూతురు పరుగున వచ్చి, "అమ్మా! వీళ్ళ పాప కాన్వెంట్ డ్రెస్ టెరిలిన్‌దే! ఎంత చెప్పినా నువ్వు వినవు. నాకు కాటన్‌దే కుట్టిస్తావు" అంది.

దాని అభియోగం అర్థం చేసుకో డానికి నాకు కొద్ది క్షణాలు పట్టింది. తర్వాత నెమ్మదిగా- "కాన్వెంట్ డ్రస్సుకి నువ్వు టెరిలిన్ బట్టలు కొంటావా? అందం చందంలేని ఆ డ్రస్సుకి అంత డబ్బు వృధా కదూ?" అన్నాను.

లక్ష్మి నవ్వి, "ఆలోచిస్తే ఏది లాభమో నీకు తెలుస్తుంది. కాటన్‌వి కుట్టించామనుకో. ప్రతి రోజూ శుభ్రంగా ఉంచకపోతే కాన్వెంట్ వాళ్ళు ఒప్పుకోరు. కాటన్ గుడ్డలమురికి ఇంట్లో వద లదు. ఒకవేళ వదిలినా ఇస్త్రీ బాగా రాదు. అందుకని వారంలో అయిదు రోజులకీ అయిదు జతలు కుట్టించాలి. ఎందుకంటే ఏరోజుకారోజు ఉతికిచ్చే చాకలి ఉండడు. ఇంత జరిగాక అన్నెల్లు తిరక్కుండా అవి చిరుగు పట్టేస్తాయి. అదే టెర్లిన్ డ్రస్సులు తీయించావనుకో— రెండంటే రెండు తీయిస్తే చాలు! ఇంట్లో ఉతుక్కోవచ్చు. ఇస్త్రీ అక్కర్లేదు. కనీసం రెండేళ్ళు మన్నుతాయి. అప్పుడైనా పొట్టయినందుకు తీసేయాలి తప్పితే చిరిగి పోవు. ఆరంభంలో కాస్త ఖర్చెక్కువైనా చివర్లో ఇవే లాభంగా ఉంటాయి" అంది.

ఈ మాటలు నాకు మామూలుగా అనిపించలేదు. ఏదో జీవిత సత్యం వాటిలో నిగూఢంగా దాగి ఉన్నట్లు అనిపించింది.

అప్పుడే నా భర్త చంద్రం, లక్ష్మి భర్త శేఖర్-ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఓసారి లోపలకు వచ్చారు.

నేను వారిద్దర్నీ చూశాను.

నాకు నా భర్త ధరించినవి కాటన్ బట్టలుగానూ, శేఖర్ ధరించినవి టెర్లిన్ బట్టలుగానూ కనిపించాయి. *